క్లుప్తంగా

ఎమ్మెల్సీ మేరిగను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


మేరిగను పరామర్శించిన అనంతరం నాయకులతో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి

చిల్లకూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్‌ను గురువారం కోవూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల మేరిగ మురళీధర్ తండ్రి ఆనందరావు మృతి చెందడం విదితమే. ఈ నేపథ్యంలో గూడూరులో సనత్‌నగర్‌లోని మేరిగ నివాసానికి వెళ్లి ఆయనను ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ప్రసన్నకుమార్‌రెడ్డి తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి నుంచి తమ కుటుంబానికి మంచి పరిచయాలు ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో గూడూరు, కోట, చిట్టమూరు మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అధికార పార్టీ నేతను.. మీ మీదే కేసులు పెట్టిస్తా!


తెలుగుగంగ కాలువ పూడ్చి వరి సాగు చేసేందుకు సిద్ధం చేసిన ప్రభుత్వ భూమి

చిట్టమూరు: మండలంలోని నార్త్‌వరత్తూరు గ్రామ కాత్రేవుచెరువు పోరంబోకు భూమి, తెలుగు గంగ కాలువను నిలువునా జేసీబీతో పూడ్చి వ్యవసాయానికి అనువుగా మార్చిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత చెరువు పోరంబోకు భూమిని జేసీబీతో చదును చేసి ఆక్రమించాడని, అలాగే పలు గ్రామాల చెరువులకు తెలుగుగంగ నీరు సరఫరా అయ్యే కాలువను కూడా పూడ్చి ఆక్రమించేశాడని తెలిపారు. సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి పంటల సాగుకు సిద్ధం చేశాడు. దీనిపై ప్రశ్నిస్తే ..తాను అధికార పార్టీ నేత అని, అడ్డొస్తే కేసులు పెడతానని బెదిరింపులకు దిగుతున్నాడని వాపోతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, జిల్లా కలెక్టర్ స్పందించి ఆక్రమణలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

బేకరీల్లో తనిఖీలు

కోట: మండల కేంద్రంతోపాటు విద్యానగర్‌లోని పలు బేకరీలు, స్వీట్ దుకాణాల్లో గురువారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎస్.మద్దులేటి తనిఖీలు చేశారు. నాణ్యత లేని, బూజు పట్టిన తినుబండారాలు విక్రయిస్తున్నారనే ఫిర్యాదుపై విచారణ చేశారు. విద్యానగర్‌లోని ఓ బేకరీలో తయారు చేస్తున్న ఆహార పదార్థాలు నాణ్యత లేకపోవడంతో వాటి శాంపిల్స్ తీసుకెళ్లారు. బేకరీకి నోటీసులు జారీ చేశారు. మద్దులేటి మాట్లాడుతూ, బేకరీల్లో నిబంధనలు పాటించాలన్నారు.

27మందికి ఉద్యోగాలు



సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీ గోకులకృష్ణా ఇంజినీరింగ్ కళాశాలలో స్మార్ట్ బ్రెయిన్ ఇంజినీర్స్ అండ్ టెక్నాలజిస్ట్ ఆధ్వర్యంలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. బినిత్ కంపెనీ ప్రతినిధి ఆనంద్, మేనేజర్ హరికృష్ణ కో-ఆర్డినేటర్‌గా సెలెక్షన్స్ నిర్వహించారు. హాజరైన 155 మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో వివిధ కాలేజీలకు చెందిన 27 మంది మాత్రమే ఎంపికయ్యారు. వారిని కాలేజీ చైర్మన్ జీ.బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సురేష్‌బాబు, ఏఓ జి.మనోహర్ తదితరులు అభినందించారు.

డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన

గూడూరు రూరల్: గూడూరు గాంధీనగర్ సమీపంలో హత్యకు గురైన రహీద్ కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం గూడూరు డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. తమ బిడ్డను కోల్పోయిన దుఃఖంలో ఉంటే సోషల్ మీడియాలో అవాస్తవాలను పోస్టు చేసి మరింత కుంగదీస్తున్నారని, వాటిని కట్టడి చేయాలని కోరారు. అనంతరం సోషల్ మీడియా పోస్టులపై రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ మృతుడు ఎవరో..?



గూడూరురూరల్ : గూడూరు పాత బస్టాండ్ సమీపంలో సుమారు 50 నుంచి 55 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి మెడలో వెంకయ్య స్వామి రాగి డాలర్ ఉందని, అతడి గురించి తెలిసిన వారు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో కానీ.. 9490413803, 9440796342 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు కోరారు.

చికెన్ ధరలు 10-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	136
లేయర్ లైవ్	:	123
బ్రాయిలర్ చికెన్	:	242
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	266
లేయర్ చికెన్	:	210

ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ



ఉత్సవ విగ్రహం ఊరేగింపు భవనాలపై నుంచి సైతం వీక్షిస్తున్న భక్తులు



దారులన్నీ వెంకటగిరి వైపే


తమ భవంతి నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న రాజా కుటుంబీకులు


పోలేరమ్మతల్లిని దర్శించుకుంటున్న నెల్లూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ


కట్టడి చేస్తున్న పోలీసులు

అంగరంగ వైభవంగా ముగిసిన జాతర

- ప్రొటోకాల్ పేరిట పెద్దలకే దర్శనం.. సామాన్యులకు దుర్లభం
- దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లులు, వృద్ధులకు ప్రత్యేక క్యూలు లేక ఇబ్బందులు
- అంతా కూటమి నేతల కనుసన్నల్లోనే..!

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి ఇలవేల్పు శ్రీపోలేరమ్మ తల్లి జాతర గురువారం అంగరంగ వైభవంగా ముగిసింది. పోలేరమ్మ మెట్టినిల్లైన రజకుల ఇంటి నుంచి గురువారం తెల్లవారు జామున పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిరి మండపం వద్ద నిలుపు కార్యక్రమం నిర్వహించారు.అమ్మ వారిని రథంపై కొలువు దీర్చి నగరోత్సవం భక్తజన కోలాహలం నడుమ నిర్వహించారు. రాజావీధి, కాశీపేటసెంటర్, పాత శివాలయం వీధి మీదుగా మల్లమ్మ గుడి ప్రాంతం అమ్మవారి నిమ్రజ్జనతో జాతర పరిసమాప్తమైంది. అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రజలు మిద్దెల మీదు చేరుకున్నారు.

కూటమి నేతల పద్మవ్యూహంలో జన జాతర

కూటమి నేతల పద్మవ్యూహంలో జన జాతర కొనసాగింది. అడుగడుగునా సాంప్రదాయాలకు తిలోదకాలిచ్చారు. తాగేందుకు కూడా గుక్కెడు నీటికి భక్తులు పడరాని పాట్లు పడ్డారు. వీఐపీల పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్శనంలో కూటమి నేతలే ఎక్కువగా కనిపించారు. ప్రొటోకాల్ అంటూ కొత్త నిబంధనలకు తెరలేపి ఇష్టానుసారంగా అక్కడి నుంచి పెద్దలకు దర్శన భాగ్యం కల్పించారు. సామాన్య భక్తులకు దర్శనం నామమాత్రమైంది; పలు ఇబ్బందులూ పడ్డారు! అంతేకాకుండా పోలీసుల వలయంలో అమ్మవారిని దర్శించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జాతరలో రాజా కుటుంబీకులకు ఇవ్వాల్సిన మర్యాదలు కూడా ఇవ్వకపోవడంతో విమర్శలకు తావిచ్చింది. ఉదయం నుంచి వాతావరణం చల్లబడడంతో 10 గంటల తర్వాత నుంచి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో చేరుకోవడంతో క్యూలు కిక్కిరిసాయి. వేలాది మంది భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితులు కలిగాయి. మరోవైపు దివ్యాంగులు, చంటి బిడ్డల తల్లులు, వృద్ధులకు ఎలాంటి క్యూలు, ఏర్పాటు చేయకపోవడంతో పలువురు ఇబ్బందులు పడ్డారు.


నగరోత్సవంలో కిక్కిరిసిన భక్తజనం


బలి కత్తికి పూజ చేసి తీసుకెళ్తున్న దృశ్యం


దప్పులతో అమ్మవారికి సరవళ్లు సమర్పిస్తున్న రాజాల అనుచరులు


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వరన్

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ



మహిళలతో ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

నాయుడుపేటటౌన్: పట్టణంలో హెచ్ఐవీ నివారణ చర్యలపై స్థానిక నవజీవన్ ఆర్గనైజేషన్ పొదుపు సంఘాల మహిళలతో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించింది. హెచ్ఐవీ వ్యాప్తి, లక్షణాలు, నివారణ చర్యలు, జాగ్రత్తలు తదితర విషయాలపై తొలుత ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజి అవగాహన కల్పించారు. అనంతరం మహిళలతో వివిధ వీధుల్లో ర్యాలీ చేయడంతోపాటు పలు కూడళ్ల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూలు ఎం.సాయిలక్ష్మి, టీ.శ్రావణి, ఏఎన్ఎం జీ.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

- ప్రజా ప్రతినిధులు గైర్హాజరవడమే కారణం
- షాడో ఎంపీపీ పెత్తనంపై విమర్శలు


ప్రజా ప్రతినిధుల కోసం సమావేశ మందిరంలో నిరీక్షిస్తున్న మండల స్థాయి అధికారులు

చిల్లకూరు: మండల సర్వ సభ్య సమావేశానికి ప్రజా ప్రతిప్రతినిధులు హాజరు కాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ గోపి ప్రకటించారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ టి.వెంకట రమణమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించనున్నట్టు ముందుగానే సభ్యులు, అధికారులకు సమాచారమిచ్చారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంపీపీగా ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీపీ ప్రాతినిధ్యం వహిస్తున్న సెగ్మెంట్‌కు చెందిన కూటమి నాయకుడు పెత్తనం షాడో ఎంపీపీ పెత్తనం చెలాయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఎంపీపీ సెగ్మెంట్‌కు చెందిన ఓ నాయకుడు షాడో ఎంపీపీగా వ్యవహరించే వ్యక్తి, అధికారులు కనీస సమాచారం ఇవ్వకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని ప్రజా ప్రతినిధిని సమావేశానికి హాజరు కాకుండా నిలిపివేసినట్లు తెలిసింది. దీంతో ప్రజా ప్రతినిధులెవరూ హాజరు కాలేదు. దీంతో మండల స్థాయి అధికారులు సుమారు మూడు గంటల పాటు నిరీక్షించి చివరకు విసిగి వేసారి వెళ్లిపోయారు.

సాంప్రదాయాలకు తిలోదకాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: వెంకటగిరి జాతరలో సాంప్రదాయలకు తిలోదకాలు ఇచ్చారు. సనాతన ధర్మాన్ని విస్మరించి ఇష్టానుసారంగా జాతర నిర్వహించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మవారి జాతర ఆరంభం, తాంబూలం స్వీకరణ మొదలు జాతర ముగింపు వరకు పలు తప్పిదాలు చోటు చేసుకున్నాయని భక్తులు మండిపడుతున్నారు. బుధవారం రాత్రి పోలేరమ్మ తల్లి కుమ్మరింట నుంచి మెట్టినింటి వద్ద మండపం వరకూ తప్పిదాలు ఉన్నాయి. వాస్తవానికి అమ్మవారికి సంబంధిత పనిబాటల వాళ్లు కళ్లు, దిష్టి చుక్క పెట్టాలి. అయితే జాతర నిర్వాహకులే అంతా తామై వ్యవహరించి కళ్లు, దిష్టిచుక్క ఏర్పాటు చేశారు. ఇది అమ్మవారి సేవకులను మనస్తాపానికి గురిచేసింది. అంతేగాకుండా రాజా ప్యాలెస్ నుంచి అమ్మవారికి సమర్పించే సారె పోలీసు బందోబస్తుతో రావాల్సి ఉండగా, ప్యాలెస్‌కు ఎవరినీ వెళ్లకుండా చేయడంతో చివరకు రాజా కుటుంబీకులే ఆ కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన పరిస్థితి కలిగింది. ప్రధానంగా ప్రొటోకాల్ ఉన్న వారికి మాత్రమే దర్శనంటూ స్థానిక ప్రజా ప్రతినిధి ఆర్భాటంగా ప్రచారం చేశారు. అయితే ప్రొటోకాల్‌కు సంబంధం లేని వ్యక్తులను కూడా పోలీసులు దగ్గరుండి అమ్మవారి దర్శనం కల్పించడంతో సామాన్య భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే దర్శన సమయాల్లో ఏర్పాటు చేసిన క్యూల వద్ద గతంలో మజ్జిగ, మంచినీటి సౌకర్యం నిరంతరంగా కొనసాగుతుండేది. కానీ ఈ ఏడాది ఏ క్యూ వద్ద చూసినా ఒక్క మజ్జిగ ప్యాకెట్ కూడా ఇవ్వకపోవడం గమనార్హం! మద్యం షాపులు మూసివేసినా ఎక్కడ పడితే అక్కడ..ఎంత కావాలో అంత మద్యం బెల్టుషాపుల వద్ద మందుబాబులకు లభించడం కనిపించింది.

ముస్లిం మైనారిటీ కమిటీల నియామకానికి కసరత్తు


ముస్లిం నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు: నియోజకవర్గంలోని అన్ని మండలాలలో పార్టీ ముస్లిం మైనారిటీ అనుబంధ సంఘాల నాయకులను నియామకానికి కసరత్తు చేస్తున్నట్టు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్లు, ముస్లిం నాయకులతో ఆయన సమీక్షించారు. నియోజకవర్గంలో అన్ని మండలాలలో అనుబంధ విభాగాల నియామకాలను వీలైనంతవరకు పూర్తి చేశామని, ఈ క్రమంలోనే ముస్లిం మైనారిటీ కమిటీల నియామకం నిమిత్తం నిబద్ధత, అంకితభావం కలిగిన ఆయా మండలాల నాయకుల బాధ్యతలు అప్పగించనున్నట్లు చెప్పారు. దీనికిగాను సీనియర్ ముస్లిం నాయకులు సమర్థులను ఎంపిక చేయాలని కోరారు. ఎంపిక చేసిన నాయకులు, కార్యకర్తల పేర్ల జాబితాను కేంద్ర కమిటీ కార్యాలయానికి పంపి ఆ తర్వాత ప్రకటించనున్నట్టు తెలిపారు. సమీక్షలో వైఎస్సార్‌సీపీ గూడూరు, కోట, చిట్టమూరు మండలాల కన్వీనర్లు మల్లు విజయకుమార్‌రెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి, నాయకులు రాజారెడ్డి కస్తూరిరెడ్డి, జలీల్, అజీజ్‌బాయ్, అల్తాఫ్, రఫీ, జిలాని, పూర్ణ, సుజనారెడ్డి, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు


గెలుపొందిన విద్యార్థులతో పీఈటీలు

దొరవారిసత్రం: స్థానిక బీసీ గురుకుల పాఠశాల ఆవరణలో 69వ ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు గురువారం ముగిసాయి. చివరి రోజు మండలంలోని జెడ్పీ హైస్కూల్, మావిళ్లపాడు ఆదర్శ పాఠశాల, డీవీ సత్రం గురుకులం విద్యార్థులకు వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు షీల్డ్, ప్రశంసా పత్రాలు అందజేశారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు త్వరలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ రమణయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు కొండయ్య, కృష్ణయ్య, ప్రిన్సిపాల్ తిరుపతయ్య, పీఈటీలు శ్రీనివాసులు, లలిత, చంద్ర పాల్గొన్నారు.

ఎక్కడ పడితే అక్కడ పట్టాలు దాటొద్దు

దొరవారిసత్రం: ఎక్కడ పడితే అక్కడ రైలు పట్టాలు దాటి విలువైన ప్రాణాలు పోగొట్టుకోవద్దని సూళ్లూరు పేట ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు. గు రువారం సాయంత్రం డీవీ సత్రం, పోలిరెడ్డిపాళెం, మే లుపాక, అక్కరపాక తదితర గ్రామాల సమీపంలో రై లు గేట్లు తొలగించి అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించిన ప్రాంతాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు, స్థాని కులకు రైలు ప్రమాదాలపై ఆయన అవగాహన కల్పించారు.

బ్రహ్మోత్సవాల్లో రాజకీయ పెత్తనం


స్కిట్ చేస్తున్న జబర్దస్త్ టీమ్, స్క్రీన్‌పై సీఎం, ఎమ్మెల్యే

చిట్టమూరు: మల్లాం సుబ్రమణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో మితిమీరిన రాజకీయ జోక్యం చోటు చేసుకుందనే విమర్శలొస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలక మండలి దేవదాయ శాఖ అధికారులను పక్కన పెట్టి నేతలే పెత్తనం చెలాయిస్తున్నారు. ఉత్సవాల నిర్వహణ విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఇటీవల గూడూరు డీఎస్పీ గీతాకుమారి హెచ్చరించారు. అయితే మల్లాంలో పాలక మండలి సభ్యులు వాటిని బేఖాతరు చేస్తూ జబర్దస్త్ టీమ్‌తో స్కిట్‌లు చేయించారు. భారీ స్క్రీన్‌లపై సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే సునీల్ కుమార్ చిత్రాలను ప్రదర్శిస్తూ, టీడీపీ పాటలను పాడించారు. దీనిపై భక్తులు ఇలా చేయడం ఏమిటని మండిపడ్డారు.

శతాధిక వృద్ధుడు మృతి


రామయ్య మొదలియార్(ఫైల్)

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరుకు చెందిన శతాధిక వృద్ధుడు ఆరూరు రామయ్య మొదలియార్ (103) గురువారం మృతి చెందాడు. జీవితకాలంలో ఆయన ఎక్కువగా మొక్కలు నాటడం, వాటిని కాపాడడం ఇష్టమైన పని అని, ఆయన మరణించేంత వరకూ ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కోలేదని కుటుంబసభ్యులు తెలిపారు. పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, న్యాయవాదులు రామయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు



తిలకిస్తున్న భక్తులు



కల్యాణ వైభోగమే..!

- కనుల పండువగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం
- జనసంద్రమైన మల్లాం
- స్వామి వారి సన్నిధిలో ఒక్కటైన వధూవరులు


భక్తులకు భోజనం వడ్డిస్తున్న దువ్వూరు శేషురెడ్డి

చిట్టమూరు: మండలంలోని మల్లాంలో నిర్వహిస్తున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహోత్సవాలలో గురువారం స్వామివారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నూతన కల్యాణ మండపాన్ని పలు రకాల పుష్పాలతో ఆకర్షణీయంఆ అలంకరించి స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చారు. వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల హోరు, భక్తజన సందడి నడుమ ఆలయ ప్రధానార్చకులు మూలంరాజు బాణుప్రకాష్ శర్మ, యాజ్ఞికులు మయూరు ఆగమశాస్త్ర ప్రకారం కళ్యాణోత్సవం నిర్వహించారు. పలువురు నూతన వధూవరులు సైతం స్వామివారి సన్నిధితో ఒక్కటయ్యారు. స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. కల్యాణోత్సవానికి తమిళనాడు, హైదరాబాద్ తదితర సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు వచ్చారు. దాదాపు 15మందికి పైగా రావడంతో ఎటుచూసినా మల్లాం భక్తజన సందోహంతో కనిపించింది.

భక్తులకు భారీ అన్నదానం

కల్యోత్సవానికి హాజరైన భక్తులకు మల్లాంకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దువ్వూరు శేషురెడ్డి, సోదరులు రామరాఘవరెడ్డి, రామలింగారెడ్డి వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి ఏటా కళ్యాణోత్సవం రోజున తమ తల్లిదండ్రుల స్మారకార్థం ఈ వితరణ చేయడం ఆనవాయితీ.